రెండో కాపురం



సునంద మరోసారి ఆ ఉత్తరం చదివింది, డాబామీద కూర్చుని సాయంసంధ్యారాగంలో. కాని నమ్మకం కుదరలేదు. సునంద చిన్నాన్న కూతురు భార్గవి విజయనగరం నుండి రాసిన రెండో ఉత్తరం. సుదీర్ఘమైన ఆ ఉత్తరం ఆఖరి పంక్తులివి "మగవాడి హృదయం కోర్కెల రెక్కల గుర్రం. దాని భార్య ప్రేమ బంధం అనే కళ్ళెం వేసి అదుపులో

ఉంచుకోవాలి. ఆ బంధంనుండి విముక్తుడైన మగవాడి వొంటరితనం పరిస్థితుల ప్రాబల్యం అనే వంకతోనో, మరో రకంగానో, లొంగిపోయి పతనానికి దారితీస్తుంది. భర్త తనవాడు అని ఎంత నమ్మకమున్నా ఈ నమ్మకం వొకప్పుడు మన కుటుంబ విచ్ఛిన్నానికి దారితీస్తుందో ఏమో! ఆలోచించు"...

"తనకన్నా చిన్నది భార్గవి యెంత సున్నితంగా తన అభిప్రాయాన్ని వెల్లడించింది." ఆశ్చర్యం వేసింది సునందకు. "యింకో గంటలో ఎలాగూ వస్తారు కదా! యేమిటో ఈ సంగతి తేల్చివేయాలి, ఆయన మనస్సుకు తెలుసు. అతను నిన్ను యెంత గాఢంగా ప్రేమించి పెండ్లి చేసుకున్నారో తెలుసు. యెంతగా ఆరాధిస్తున్నారో తెలుసు. అలాంటి వాడినా అనుమానిస్తావు; ఇది కేవలం నీ మనఃభ్రాంతియేమో! దీనివల్ల మీ మధ్యనుండే అనురాగబంధం విచ్ఛిత్తి అవుతుందేమో!"

"చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం యేముంది?"

మనస్సులో ఆలోచనల ప్రతిరూపాలు ప్రతిధ్వనిస్తున్నాయి. "యెలాగైనా సున్నితంగా చెప్పాలి. వ్యవహారం చెడగొట్టుకోకూడదు. తను ఏమాత్రం భర్తననుమానించినా అతను మొండికేస్తే-"అమ్మో యింకేమేనా ఉందా!" అనుకుంది మనసులో. భయంతోనే కళ్ళు మూసుకుంది. భార్గవి రాసిన మొదటి ఉత్తరంలో కొన్ని పంక్తులు ఆమెకింకా జ్ఞాపకం ఉన్నాయి. "మా వీధికి అవతల మూడు వీధుల తర్వాత బావగారు ఒకరూము తీసుకున్నారు. అప్పటికీ మీ మరిదిగారూ, నేనూ చెప్పాం మేం అద్దెకున్న ఇంట్లోనే వొక రూం ఖాళీగా ఉందని, అందులో ఉండమని. కానీ ఆయన అంగీకరించలేదు. మూడు నాలుగుసార్లు మీ మరిదిగారు బ్రతిమాలారు. కానీ బావగారు మొండి పట్టు మనకు కొత్తేంకాదు. మొన్నోసారి ఆ వీధిలోనే ఉండే మీ మరిదిగారి ఆఫీసు కొలీగ్ కొడుకు బర్త్‌డే ఫంక్షనుకు ఆ వీధి కెళ్ళాను. అప్పుడు మీ మరిదిగారు, బావగారి రూమ్ చూపించారు. పెద్ద మేడింట్లోనే ఆయన రూమ్ సంపాదించారు. ముందుభాగంలోనే వుంది.

తర్వాత ఆ మేడింట్లో చాలా అందమైన ఆడపిల్లలు కన్పించారు. ఆ ఇంటాయన రైల్వేలో రిటైరయిన పెద్దఉద్యోగస్థుడట. ముగ్గురాడపిల్లలట. అందులో పెద్దమ్మాయికి పాపం భర్త పోయాడట. మెరపుతీగలా ఉంటుందనుకో! గార్డెన్ లో చూశాను, మొక్కల్ని చూస్తూంటే ఆమెను. పేరంటం కొచ్చినవాళ్లు, ఆమె చాలా గొప్పగా వీణ వాయిస్తుందని..."

తర్వాత మరి సునంద వర్తమానంలోకి వచ్చేసింది.

"మమ్మీ? డాడీ యింకా యెప్పు డొస్తారే" అన్న కొడుకు రవిని గాఢంగా గుండెలకు హత్తుకుంది. అప్రయత్నంగానే, భయంతో ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"యిప్పుడే వస్తారు బాబూ! యింకా విజయనగరంనుండి బస్సు రాలేదు కదా!" అంది. డాబామీద కూర్చుంటే సూర్యమహల్ దగ్గర ఆగే బస్సులు కన్పిస్తాయి.

"మమ్మీ! మనం గూడా డాడీ దగ్గరకు వెళ్ళిపోదాం" అన్నాడు రవి ముద్దు ముద్దు మాటలతో.

"అలాగే బాబూ! ఈసారి నాన్నగారు రాగానే నువ్వే అడుగు."

"యేమండోయ్! సునందగారూ! మీ ఆయనగారింకా రాలేదా! ఈవారం పత్రికలో మీ ఆయనగారి కథానిక ప్రచురణ జరిగిందండి. చదివాను. చాలా బాగుంది ఈ మధ్య మీ ఆయన మంచి మంచి కథలు రాస్తున్నారండీ! నిజంగా మీ రెంతో అదృష్టవంతులండీ, మంచి రచయిత భర్తగా దొరకటం." పొరుగింటి డాబా యజమానురాలు కనకవల్లి, జాజిపూలదండ గుచ్చుతూ ప్రశంసించింది. నవ్వేసింది సునంద.

"అవును నిజమే! కానీ నా అంత రంగంలో అంతర్నాళాలలో జ్వలిస్తున్న హిమజ్వాల మీకేం తెలుసు" అనుకుంది ఉత్తరం మడిచేసి, మెట్లు దిగుతూ.

రాత్రి పదయింది. భర్త కిష్టమైన వన్నీ తయారుచేసినవి చల్లారి పోయాయి. రవి డాడీకోసం యెదురు చూసి, నిద్రలోకి జారుకున్నాడు.

భర్తను ఈ రాత్రే అడిగేయాలి. తెల్లారితేస్తే ఆదివారం. ఆయనొచ్చేరని ఫ్రెండ్సందరూ వొచ్చేస్తారు. కాస్సేపు సాహిత్య ప్రసంగం. ఆ తర్వాత చతుర్ముఖ పురాణం. సాయంకాలం సినిమా, మళ్ళా ఉదయం విజయనగరం ప్రయాణం.........

తలుపు చప్పుడయింది. యెదురుగా రాంబాబు, తన భర్త! "సారీ సునందా! బస్సు లేటయింది." రణస్థలం దగ్గర ట్రబులిచ్చేసింది. అందువల్ల లేట్ అయింది." బేగ్ పక్కన పెడుతూనే సునందను రెండుచేతుల్తోనూ దగ్గరకు తీసుకున్నాడు. సునంద నిర్లిప్తంగా గాఢ పరిశ్వంగంనుండి విడిపించుకుంది.

ప్రతీ శనివారం భర్త సమంగా సాయంకాలం ఆరుగంటలకు వచ్చేసే వాడు. అలాంటిది ఆ మెరుపుతీగ ఆఖరు బస్సుకు వెళ్ళమని చెప్పి ఉంటుంది. సునంద మనస్సులో అనుమానాలు గాలిలో మేడల్లా లేస్తున్నాయి.

"యేమిటో దేవిగారు చాలా

మౌనంగా వున్నారు. చెప్పానుకదా, లేటుకు కారణం. మమ్మల్ని కొంచం అనుగ్రహించండి. డైనింగ్ టేబిల్ దగ్గర, దగ్గరకు తీసుకున్నాడు.

"చారు కొంచెం వేడిచేసి తీసుకు రానా...?" మాట మార్చింది.

"అక్కర్లేదు. దేవిగారే వేడిగా ఉన్నారు. పదార్థాలూ, ఈ డైనింగ్ టేబిల్‌తోబాటూ నేనూ వేడెక్కిపోయాను" అన్నాడు నవ్వి.

సునందకు నవ్వు వచ్చింది చాలా చమత్కారంగా, సున్నితంగా మాట్లాడ తాడు. అదే ఆకర్షణలోనే తను అతన్ని ప్రేమించింది, ఆరు సంవత్సరాల క్రితం. అప్పుడు రాంబాబు, విశాఖలో తమ యింట్లో ముందున్న రూమ్‌లో అద్దెకు ఉండేవాడు. అతనే రాంబాబని, మంచి కథారచయితనీ ఆమెకు తెలియదు. ఒకనాడు పోస్టులో వచ్చిన చెక్కు, పత్రిక, గది తలుపులు తాళం వేసి వుండే, పోస్టుమేన్, వాళ్ళింట్లో యిచ్చిపోయాడు. అప్పుడు తెలిసింది అతడు రచయితని. పెళ్ళయిన తర్వాత రాంబాబుకు శ్రీకాకుళం ట్రాన్స్‌ఫర్ అయింది. ఆర్నెల్ల క్రితం విజయనగరం ట్రాన్స్‌ఫరు, వొంటరి జీవితం మేడింట్లో ముందుగది అమ్మాయి ... భయంతో వొళ్ళు గగుర్పొడిచింది, సునందకి మళ్ళీ.

బెడ్‌రూంలో ట్రాన్స్‌ఫార్మర్ బల్బు మందంగా వెలుగుతోంది. పాలమీగడ లాంటి బెడ్‌షీట్, చుట్టూ దోమతెర. సిగరెట్టు కాల్చుకుంటున్నాడు రాంబాబు. సునంద పాలగ్లాసుతో వచ్చింది.

"యింతకీ దేవిగారు యివాళ మూడ్‌లో లేకపోవడం మా దురదృష్టం" అన్నాడు జరీపువ్వుల తెల్లచీరలోవున్న సునందను చూస్తూ.

"బాబు మీకోసం చాలాసేపు చూసి నిద్రపోయాడు."

"నేను నీకోసం వారంరోజులు విరహంలో కొట్టుకొని నలభై మైళ్ళు నాలుగున్నర గంటలు ప్రయాణంచేసి మరీ వచ్చాను..." రాంబాబు సునందను కౌగిట్లోకి తీసుకుంటూ.

భర్తముఖం పరిశీలనగా చూసింది సునంద. ముఖంనిండా అక్కడక్కడా గాట్లు నఖక్షతాలా లేక దంతక్షతాలా ఆ మెరుపుతీగ వలలోనో, ఆ అమ్మాయి వలలోనో..." మరింక ఊహించలేక కళ్ళు మూసుకుంది సునంద.

"యేమిటీ ఆలోచిస్తున్నావ్?'' బుగ్గ మీద మధురమైన ముద్ర.

"ఏమైనా మీరు విజయనగరం వెళ్ళిన తరువాత చాలా మారిపోయారు."

"అందే..." దగ్గరకు తీసుకుంటూ.

"చాలా బాగా సిరసించిపోయారు. ఆ హోటల్ భోజనం తిని యెన్నాళ్ళు - చూడండీ ఆ బుగ్గలు యెలా లోతుకు పోయాయో..." ప్రశ్నించింది.



"కొంతకాలం తప్పదు సునందా నాకీ వనవాసం.

"యెందుకండీ మీకీ వనవాసం. విజయనగరంలో మంచి యిళ్ళు దొరకవా? వాతావరణం మంచిది కాదా! మీరు శనివారం రావటం సోమవారం వెళ్ళటం ..." అసలు అనుమానం బయటకు చెప్పలేకపోయింది.

"చాలా బాగుంటుంది విజయనగరం. సాహితీ సంస్కృతుల నిలయం. ఇళ్లూ మంచివి దొరుకుతాయి. అయినా ఆర్నెల్లుగా లేంది ఈవాళ యెందుకడుగుతున్నావ్, ఈ ప్రశ్నలన్నీ..." అన్నాడు రాంబాబు అనుమానంగా. సునంద భార్గవి రాసిన ఉత్తరం సంగతి చెప్పలేకపోయింది.

"యేం లేదండీ. బాబు మీ దగ్గరకు వెళ్ళిపోదాం మమ్మీ అంటున్నాడు."

"బాబా! నువ్వా ... ఇంకెంతకాలం, ఓపికపట్టు..." రాంబాబు సునందని మరి మాట్లాడనివ్వలేదు.

* * *

శనివారం సాయంకాలం మళ్లా డాబా మీద కూర్చుని ఆలోచిస్తున్నది సునంద. సూర్యమహల్ దీపాల తోరణాలు మినుకు మినుకుమంటూ వెలుగుతున్నాయి, ఆమె మనసులోని ఆలోచనలు మినుకు మినుకుమంటూ మెదులుతున్నాయి. ఆమె మనసులోని ఆలోచనలతో అనుమానాలతో స్నేహం చేసి. 'ఆదివారం, సోమవారం కేంపు వెళుతున్నాను రాలేనంటూ' రాంబాబు రాసిన ఉత్తరం ఆమె చేతిలో గాలికి రెపరెప లాడుతోంది. "యేంలేదు - అక్కడే ఉండిపోయి ఉంటారు. అందంగా ఉండే రచయిత అంటే ఎవరికి మోజు ఉండదు. ఆ మేడింటి వాళ్ళు యేదో పిక్నిక్ వేసుకుని ఉంటారు.

అందమైన అమ్మాయిల్ని చూస్తే, ఏ మగవాడికి మనసు చంచలంకాదు. ఈ రచయితల ఆదర్శాలన్నీ రాతలవరకే." ఆమె మెదడు అనుమానం చెదపురుగు దొలిచేస్తోంది.

ఆమె మనసులో యెలాగ సమాధానం పెట్టుకుందామన్నా రాజీపడటంలేదు.

భార్గవి తర్వాత రాసిన రెండు సుదీర్ఘమైన లేఖలు ఆమెను మరేం ఆలోచించనివ్వటంలేదు. అందులో కొన్ని వాక్యాలు ఆమె మనః పలకం నుండి తొలగిపోవడంలేదు.

"మల్లా ఈ మధ్య ఆ వీధి పేరంటానికి వెళ్ళాను. పేరంటానికి వచ్చిన ఆ వీధిలో కొంతమంది అమ్మలక్కలతో పరిచయం కలిగింది. అలాంటివాళ్ళేనట ఆ మేడింటివాళ్లు. యెప్పుడూ యీయనగారి గదిలో దీపం వెలుగుతూనే ఉంటుందిట. నేను మీ మరిదిగారితో యీ విషయం అంటే 'ఛా ! అన్నయ్య గురించి అలా మాట్లాడకు' అని మందలించారు. కానీ ఆయన కూడా మొన్న జరిగిన సంఘటనతో నా వాదన సరైనదేనని అంగీకరించారు. ఈ మధ్య 'కల్పన' సినిమాకు వెళ్లాం. ఆ మేడింటివాళ్ళ ఆడపిల్లల్తోబాటు శ్రీబావగారు వచ్చారు. ఆ మెరపుతీగా వచ్చింది. యింకచూడు ఇంటర్వెల్లులో నవ్వులు కేరింతాలు. డ్రింకులు త్రాగడం. ఈ కళ్లతో చూసిన దృశ్యాలు మరి రాయలేను. ఆ ఆడపిల్లలందరూ నిజంగా కుందన బొమ్మల్లాగే ఉంటారు.

బావగారు నిన్న వస్తే, "యేమిటన్నయ్యా అంత నీరసంగా ఉన్నావు. కళ్ళు లోతుకపోయినాయి. రాత్రిళ్ళు సమంగా నిద్రపోవటంలేదా ?" అని అడిగారు మీ మరిదిగారు.

"లేదు. సమంగా నిద్రపోనివ్వడం లేదు సరస్వతీదేవి. యేం చేస్తాం ? నా కీ రెండో కాపురం తప్పదనుకుంటాను" అని నవ్వుతూ సమాధానం చెప్పారు.

"వాళ్ళలో ఒక అమ్మాయి పేరు సరస్వతీదేవనుకుంటాను మరి. వాళ్ళు బాగా ఉన్నవాళ్ళట గూడాను. యివన్నీ యెందుకు రాస్తున్నానంటే తమనితాము సమర్థించుకోవటానికి ఈ రచయితలు. పరిస్థితుల ప్రాబల్యం అంటూ...ఏదో ఒకటి మొదలుపెడతారు మరి...యిలా రాశానని......"

సునంద ఆలోచనల తెరలన్నీ తెగిపోయాయి. కనకవల్లి డాబామీదనుండి పిలుస్తోంది. "యేమండోయ్ ఈ నెల మీవారి ప్రోగ్రెస్ బాగుందండోయ్; నాలుగు పత్రికలలోనూ నాలుగు కథలు, మాసపత్రికలో సీరియల్ నవల ప్రారంభం. ఈసారి పత్రికలవాళ్ళు పంపించే డబ్బుతో పట్టుచీర కొనుక్కోండి. చాలా బాగున్నాయండి

కథలు. సీరియల్ యెత్తుగడలోనే పాఠకు ల్నాకర్షించేసిందండి. యెలా రాస్తారో ఈ మగవాళ్ళింత చక్కగా..." కనకవల్లి కాంప్లిమెంట్సు అందించేస్తుంది. ఉచితంగా మల్లెలమాల కుట్టుకుంటూ

"కొంపతీసి ఈ కనకవల్లి గూడా తన భర్తని ప్రేమించేస్తుందా ఏమిటి?" అన్న సందేహం కలిగింది. కనకవల్లి మీద చాలా కోపం వచ్చింది. ఆ కోపం క్రింద హాలులోకి వచ్చేసింది. యేదో నిశ్చయానికి వచ్చిన సునంద మనస్సు విశాఖపట్నం ఉత్తరం రాసినంతవరకూ తేలికపడలేదు

* * *

విజయనగరం కొత్త అగ్రహారంలో రాంబాబు ఉండే మేడింటికి రిక్షాలో చేరుకుంది సునంద. గదికివున్న రాంబాబు నేమ్‌బోర్డు చూసింది. గదిలో లైటింకా వెలుగుతూనే ఉంది. వాచీ చూసుకుంది. పదకొండున్నర దాటింది. భార్గవి రాసినవీ చెప్పినవీ నిజమేననుకొంది. నెమ్మదిగా పిల్లిలా గేటు తీసుకుని లోపలికి వెళ్ళి గదిదగ్గర నిలబడింది. లోపలనుండి నవ్వులు, కేరింతలు, వినబడతాయేమోననుకొంది. కాని గదిలో నిశ్శబ్దంగా ఉంది.

"నిజమే అస్తమానం మాట్లాడుకుందికి యేముంటాయి. ఒకరి కళ్లల్లోకి వొకరు చూసుకుంటూ యెదురెదురుగా కూర్చుని...తర్వాత మరి ఆలోచించలేకపోయింది సునంద. తనూ రాంబాబూ ప్రేమించుకున్న తీపిగురుతులు జ్ఞాపకం వచ్చాయి. అతనిలో ఆ ఆకర్షణ, లాలన, విద్య వుంది.

నెమ్మదిగా తలుపుదగ్గరకు వెళ్ళి నిల్చుంది తలుపు తీసే ఉంది. అయితే ఆమెగారు ఇంకా రాలేదన్నమాట. తలుపుకొడితే యెక్కడ శబ్దం అవుతుందేమోనని తీసి ఉంచారు. కోపం వచ్చింది సునందకు, ఈ మగవాళ్ళ ప్లానులమీద. నెమ్మదిగా తలుపు తోసింది 'యెవరదీ ?' టేబిల్‌మీద పుస్తకం మూసేసి వెనక్కి తిరిగి చూశాడు

తననుకున్నది నిజమే ! ఆయన ఆమెకోసం వెయిట్ చేస్తున్నారు. ఆమాత్రం చిన్నశబ్దాన్ని గూడా పాము చెవుల్లా పసిగట్టారు. పాపం యెంత విరహంతో ఉన్నారో యేమో! సునంద మనస్సు ఈర్ష్యపడింది

"యెవరదీ స......" రాంబాబు నోటిమాట రాకముందే ఆ పేరుపెట్టి ఎక్కడ పిలుస్తారేమోనని సునంద లోపలికి అడుగుపెట్టింది.

రాంబాబు ఆశ్చర్యపోయాడు. చెయ్యి మీద గిల్లుకున్నాడు. "అల్లా గిల్లుకోకండి. మీరుకలగనడంలేదు...మీ స...ను కాను, నేను సునందను..." అంది కొంచం కోపంగా.

"యిదేమిటి యింత హఠాత్తుగా

వచ్చావ్ ! యెప్పుడొచ్చావ్ ? భోంచేసేవా...?"

"ఆ భోజనం చేశాను. రాత్రి ఏడు గంటలకు భార్గవీవాళ్ళ ఇంటికి వచ్చాను" అంది తలవంచుకునే.

"అసలు సంగతేమిటి ? బాబేడీ ?" ప్రశ్నించాడు.

"యేంలేదు. ఊరికనే చూద్దామని. భార్గవి రమ్మనమని ఉత్తరం రాసింది. మా అమ్మ శ్రీకాకుళంనుంచి వస్తే బాబుని ఉంచేసి వచ్చాను."

"యేమిటంత అర్జంట్. మీ చెల్లెలికి పెళ్ళేమిటి ?" అతని ప్రశ్నకు సమాధానం చెప్పకుండా రూమంతా చూస్తోంది. చిన్న సోఫా, డన్‌లప్ సింగిల్ బెడ్డు, టేబిల్ లైటు, గోడకు అందమైన ఆర్టు పెయింట్స్ బాగానే ఉంది రూము.

"యేమిటంత పరధ్యానంగా చూస్తున్నావ్?..."

మళ్ళీ తలుపు చప్పుడయింది, చేతిలో ట్రేతో మెరపుతీగ ప్రత్యక్షమయింది. అందులో టీ పొగలు కక్కుతోంది. భార్గవి రాసినదానికన్నా చాలా అందంగా ఉంది. చేతికి బంగారుగాజులు. మెడలో రవ్వల నెక్లెస్ చాలా ఖరీదయిన చీరలో అప్సరసలా వుందామె! ముఖాన బొట్టు లేదు.

"టీ తీసుకోండి" అంటూ సునంద వైపు ఆశ్చర్యంగా చూసింది.

"సరూ !"

భార్గవి అనుమానం నిజమే అయింది. 'సరూ' అని యేకవచన ప్రయోగం చేసి పిలుస్తున్నాడు తన భర్త.

"ఈమెగారు...మీ వదిన. ఈమె ఇంటిగలవారి పెద్దమ్మాయి; పేరు సరోజిని..." అన్నాడు పరిచయం ముగించి. సునంద కింకా ఆశ్చర్యం వేసింది. ఈ సరోజిని కాక మరో సరస్వతీ ఉండాలి ఇంట్లో. కాని నిదానం మీద తెలుస్తుంది అనుకుంది, మనస్సులో కోపంగా; తన భర్త చివరకు గోపాల కృష్ణుడిలా తయారయినాడో యేమో !

"హాయ్! వొదినగారూ, మీ గురించి చాలాసార్లు అన్నగారు చెప్పారు. మిమ్మల్ని తీసుకురమ్మన్నాం. మా ఇంట్లో పోర్షను ఇస్తామని నాన్నగారు చెప్పారు. కాని అన్నగారు అందుకు వొప్పుకోలేదు..."

"యెందు కొప్పుకుంటామూ ! మరి రెండో కాపురం వెలగబెట్టాలికదా..." మనసులోనే అనుకుంది సునంద కోపంగా సభ్యతకోసం చిరునవ్వు పెదాలమీదికి తెచ్చుకుంటూ.

"ఉండండి ఇప్పుడే అందరితోనూ చెప్పి వస్తాను..." అని వెనుతిరిగింది సరోజిని.

"సరూ! ఇప్పుడు వద్దు. యింట్లో అందరు నిద్రపోతున్నారు. రేపొద్దుటే చూస్తారు మీ వదిన్ని...నీవు పోయి



పడుకో" అన్నాడు రాంబాబు ఆప్యాయంగా టీకప్పు చేతిలోకి తీసుకుని.

"పాపం సరస్వతిని చూస్తానని ఈయనకి భయమేమోమరి" అనుకుంది సునంద.

"మీ కేమయినా బ్లాంకెట్స్ కావాలా" సరోజిని గుమ్మం అవతలనుండే అడిగింది.

"యేం అక్కర్లేదమ్మా ......" అన్నాడు రాంబాబు తలుపు గడియ వేస్తూ.

అర్ధరాత్రి దాటింది. సునందకు మెలకువ వచ్చింది. రేడియం డయలు మూడు గంటలు చూపిస్తోంది. గదిలో లైటులేదు. రాంబాబు పక్కమీద లేడు. సుమారు ఇరవై నిముషాల వరకూ రాంబాబు పత్తాలేడు. సునంద అనుమానం మరింత బలపడింది. యెక్కడో తోటలో, ఆమే, యీయనా...సిగ్గులేక చలిలో...మరి ఆలోచించలేకపోయింది. 'ఛా' సిగ్గుతో కళ్ళుమూసుకుంది. తనీ యెలాగయినా యీ దొంగల్ని పట్టాలి. నిలదీసి అడిగేయాలి. యిలాంటి ప్రలోభాల్లో చిక్కుకుని వుండటం వల్లనే, శ్రీకాకుళం తిరిగి ట్రాన్స్‌ఫరు చేయించుకోకుండా వున్నారు. యీవాళతో యీయనతో అమీతుమీ తేల్చేసుకుంటాను," అని నెమ్మదిగా లేచింది సునంద.

బయట వరండామీద లైటు వెలుగుతోంది. తలుపుతోసేసరికి కన్పించే దృశ్యం, సునందని ఆశ్చర్యంలో ముంచేసింది.

రాంబాబు వరండా మెట్లమీద కూర్చుని రాసుకుంటున్నాడు. అతని

ప్రక్కగా కాగితాలు దొంతు పెట్టబడి వున్నాయి. అతని కళ్ళు బాగా యెరుపెక్కి వున్నాయి. వెలుగులోనికి చొరనీయకుండా, అతని సువిశాల వక్షస్థలాన్ని టర్కీ టవల్ కప్పుతోంది.

సునంద నెమ్మదిగా వెళ్ళి అతని ప్రక్కగా మీది మెట్టుమీద కూర్చుంది. పిల్లగాలి తెమ్మెరలు, ఆమె నుదుటమీద ముంగురులతో నాట్యమాడుతున్నాయి. చుట్టుప్రపక్కల దేన్నీ గమనించనంత శ్రద్ధగా, దీక్షగా రాసుకుపోతున్నాడు. కొన్ని క్షణాల తర్వాత రాంబాబు తలెత్తి చూశాడు.

"నువ్వా! సునందా! నిద్రపట్టలేదా?" లాలనగా అడిగాడు.

"కొత్త ప్రదేశం కదా, అందు కని..." యేం సమాధానం చెప్పాలో తోచక అనేసింది.

లోపల హాల్లో వున్న గడియారం ఐదు గంటలు కొడుతుండగానే తలుపులు తెరచుకున్నాయి.

"గుడ్‌మార్నింగ్ ... వొదినగారూ, అన్నయ్యగారూ" అంటూ మిగిలిన ఆడపిల్లలు బయటకు వచ్చేశారు. భార్గవి రాసినట్లు అందరూ ఆణిముత్యాలే.

అందర్నీ పరిచయం చేశాడు రాంబాబు. అందరూ సునంద చుట్టూ మూగారు. వెనకాతల సరోజిని వచ్చింది కాఫీ కప్పుతో, "మీ వదినగారు వస్తే కాని పూర్తికాలేదమ్మా" అన్నాడు రాంబాబు, సరోజినితో. సరోజిని కళ్ళు ఆనందంతో మెరిసాయి. సునందకు అర్థంకాలేదు. అర్థమయింది. అలా వుందామెస్థితి.

"అందరూ వదినగార్ని కోరితే కందర్రా, వంతులవారీ పంచుకుందాం. ఆడబిడ్డలందరూ అర్ధ మొగుళ్ళన్న సంగతి తెలియాలి. ముందు ఆమెను స్నానంచేసి రానీ, పదండి మీరంతా. తొందరగా తెమలండి, తన్నయ్యకు, వదినకూ బ్రేక్‌ఫాస్ట్ యిక్కడే..." అంతే.

సునంద మనస్సు ప్రఫుల్లమయిపోయింది, వాళ్ళ అనురాగానికి.

"పద లోపలికి పోదాం. యిప్పటికి నవల పూర్తయింది" అన్నాడు లేస్తూ, సిగరెట్టు వెలిగించుకుని.

ఆ కాగితాలన్నీ దొంతుగా పెట్టింది. నవలపేరు చదివింది, అంతే. మరి స్థబ్దురాలైపోయింది. ఆ నవల పేరు "సరస్వతి."

"యే మి టా లో చి స్తు న్నా వ్?" మృదువుగా రాంబాబు, సునంద భుజం మీద చెయ్యి వేశాడు. ఆమె అలా తన గుండెల్లోనే తలదాచుకుంది. పశ్చాత్తాపంతో ఆమె కళ్ళు జలపాతాలయ్యాయి. పిచ్చి సునందా! యెందుకు? యేం జరిగిందని, నువ్విలా వస్తావని నాకు ముందే తెలుసు..."

"యెలా?" ఆశ్చర్యంగా, అతనివేపు చూసింది తడి రెప్పలతో.

"అవును సునందా. చదువు వేరు. సంస్కారం వేరు. భార్గవిలో మొదటిది వుంది. రెండోది లేదు. నేను వాళ్ళందరితో చనువుగా వుండటం, ఆమె జెలసీ ఫీలయింది. నీ కేదో అన్యాయం జరిగిందని భావించి ఉత్తరం రాసి వుంటుంది. రచయితగా నేను యీ మాత్రం సైకాలజీ స్టడీ చెయ్యగలను. నా జీవితం చిన్నప్పట్నుంచీ నీకు చెప్పాను. తల్లీ, తోబుట్టువులూ యెవ్వరూ లేక యెంతగా అలమటించిపోయానో నీకు తెలుసు. అలాంటిది సరోజినీ చెల్లెళ్ల, అందరూ నా జీవితంలో అమృతం వెదజల్లారు. తోడబుట్టిన చెల్లెళ్ళుకూడా యిలా చూడరేమో! ఈ పవిత్రబంధం యెంత అదృష్టం చేసుకుంటే లభిస్తుంది. యింక మిమ్మల్ని యిక్కడకు యెందుకు తీసుకురాలేదంటే, అసలిప్పటికే ప్రమోషను రావల్సింది. మళ్ళా యెక్కడికో తీసికెళ్ళడం యెందుకని ఆగాను.

యీ వియోగం తాత్కాలికం. అంతే కాక శ్రీకాకుళంలో నా సాహిత్య వ్యాసంగం, మిత్రులవల్ల యెంత వెనక్కి పడిపోయిందో నీకు తెలుసు. యిక్కడి కొచ్చాకనే, చాలా రచనలు రాస్తున్నాను. డబ్బేకాక, మంచిపేరు కూడా సంపాదిస్తున్నాను. వొక ధ్యేయంతో ముందుకు సాగిపోతున్నాను. లేనిపోని నీవు పడే అపోహలు నా కాటంకాలవుతాయి..."

మరి మాట్లాడనియ్యలేదు సునంద.

"పొరపాటు నాదేనండి..." అంది బాధగా.

"పొరపాటు నీదికాదు. మిమ్మల్ని పుట్టించిన బ్రహ్మదేవుడిది. అనుమానం ముందు పుట్టించి మిమ్మల్ని తరువాత పుట్టించాడు."

"పోదురూ మీరు మరీను..." అంది సునంద చిరుకోపంతో.

"పోతాను. తమ రీ రెండో కాపురానికి అనుమతిస్తే" అంటూ దగ్గరకు తీసుకున్నాడు. సునంద తృప్తిగా అతని గుండెలమీద తలవాల్చి నిండుగా ఊపిరి పీల్చుకుంది.